## క్లుప్తంగా

### దోహాలో వైఎస్సార్ వర్ధంతి



దోహాలో వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శశికిరణ్

సఖినేటిపల్లి: ఖతార్‌లోని దోహాలో శనివారం దివంగత ఉమ్మడి ఏపీ సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి 14వ వర్ధంతిని పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఈ మెయిల్ ద్వారా వివరాలను వైఎస్సార్ సీపీ వర్గాలు తెలిపాయి. ఆయన చిత్రపటం వద్ద ఖతార్ వైఎస్సార్ సీపీ కమిటీ కన్వీనర్ దొండపాటి శశికిరణ్ పూల మాల వేసి నివాళులర్పించారు. శశికిరణ్ మాట్లాడుతూ, వైఎస్సార్ పరిపాలన ఒక స్వర్ణ యుగమన్నారు. బలహీన వర్గాల అభ్యున్నతికి ఎన్నో పథకాలను అమలు చేసిన మహానేత వైఎస్సార్ అన్నారు. పార్టీ నాయకులు జాఫర్ హుస్సేన్, మేడంకి రాజా, జస్వంరెడ్డి, దొండపాటి రత్నారావు, షేక్ షోయబ్, క్రాంతి, నల్లి కిషోర్, సాయికృష్ణ, ప్రసన్న, రాజేష్ పాల్గొన్నారు.

### వైభవంగా మహా చండీహోమం

కొత్తపేట: స్థానిక బోడిపాలెం విజయకనకదుర్గాదేవి ఆలయం వద్ద ఆదివారం మహా చండీహోమం వైభవంగా నిర్వహించారు. దుర్గాదేవి విగ్రహ పునఃప్రతిష్ఠాపన, జీవ ధ్వజస్తంభం, లక్ష్మీదేవి విగ్రహం, బలిపీఠం, సింహవాహన సంపూర్ణ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో భాగంగా నాలుగో రోజు ఆలయ కమిటీ, ఆలయ పునర్నిర్మాణ, పునఃప్రతిష్ఠ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి పాండు రంగాచార్యుల పర్యవేక్షణలో వేదపండితుల బృందం 150 మంది దంపతులతో మహా చండీహోమం జరిపించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిపించారు. పునఃప్రతిష్ఠకు విరాళాలు ఇచ్చిన, వివిధ రూపాల్లో సహకరించిన భక్తులను, పండితులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సత్కరించి, వేదపండితులతో వేదాశీస్సులు అందజేశారు.

### పేదలకు దుప్పట్ల పంపిణీ



అప్పనపల్లిలో పేదలకు దుప్పట్లు అందజేస్తున్న పవన్

మామిడికుదురు: కాపు నేత నల్లా పవన్ పుట్టిన రోజు వేడుకలను ఆదివారం అప్పనపల్లిలో స్థానికులు ఘనంగా నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన కేక్‌ను పవన్ కట్ చేసి అభిమానులకు పంచారు. ఈ సందర్భంగా తులా బ్రహ్మాజీ సమకూర్చిన దుప్పట్లు, చీరలను పవన్ చేతుల మీదుగా 50 మంది పేదలకు పంచారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు అడబాల తాతకాపు, సుందరనీడి చిన్ని, ఎంపీటీసీ వాసంశెట్టి వెంకటరమణ, తులా గోపాలకృష్ణ, పోతు కాశీ, తులా నాగరాజు, బొలిశెట్టి శివ, ఉప సర్పంచ్ మేడేపల్లి చిన్న, కంకిపాటి వెంకటేశ్వరరావు, తులా శ్రీను పాల్గొన్నారు.

### విద్యార్థికి ఆర్థిక సాయం



ప్రత్యూషకు సాయం అందజేస్తున్న ఉప సర్పంచ్ మునిరెడ్డి తదితరులు

రావులపాలెం: ఇంజినీరింగ్ చదువుచున్న రావులపాలేనికి చెందిన అంకాళి ప్రత్యూషకు పులవర్తి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అధ్యక్షుడు పులవర్తి గోపాలకృష్ణమూర్తి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆదివారం ట్రస్ట్ వద్ద జరిగిన కార్యక్రమంలో రావులపాలెం ఉపసర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి చేతుల మీదుగా పేద కుటుంబానికి చెందిన ప్రత్యూషకు చదువు నిమిత్తం ఈ సాయాన్ని అందజేశారు.

### దుర్వాసన భరించలేకపోతున్నాం



అంబాజీపేటలో రోడ్డుపైకి వచ్చిన మురుగునీరు

అంబాజీపేట: స్థానిక మసీదుకు వెళ్లే ప్రధాన రహదారిలో మురుగునీరు రోడ్డుపైకి రావడంతో దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మసీదుకు, పాఠశాలకు వెళ్లే చిన్నారులు, వృద్ధులు ఆ మురుగునీటిలో వెళ్లాలంటే నానా అవస్థలు పడుతున్నారు. మురుగునీరు బయటకు వెళ్లేలా చూసి, పారిశుధ్యం చేయించి బ్లీచింగ్ చల్లాలని స్థానికులు కోరుతున్నారు.

# సీజనల్ వ్యాధులు.. తస్మాత్ జాగ్రత్త

- పొంచి ఉన్న విష జ్వరాల ప్రమాదం
- వాతావరణమే కారణమంటున్న వైద్యులు



చింతలూరులో నిర్వహిస్తున్న డ్రైడేలో గ్రామస్తులకు సూచనలిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

ఆలమూరు: వాతావరణంలో మునుపెన్నడూ లేని విధంగా తీవ్రమైన ఎండలు, జోరున కురుస్తున్న వర్షాల వల్ల సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. వర్షాకాలంలో ఈ విధమైన ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ప్రతి ఒక్కరూ అనారోగ్యానికి గురవుతున్నారు. వైద్యారోగ్యశాఖ అనేక జాగ్రత్తలు తీసుకుంటున్నా వాతావరణం ప్రభావం వల్ల విష జ్వరాలు సంభవిస్తున్నాయి. అప్పుడప్పుడు కురుస్తున్న వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. ఖాళీ స్థలాల్లో మురుగునీరు చేరి అపరిశుభ్రత చోటు చేసుకుంటుంది. దీంతో దోమలు వృద్ధి చెందడమే కాకుండా తాగునీరు కూడా కలుషితమయ్యే పరిస్థితులు తలెత్తుతున్నాయి. వాతావరణ మార్పుల కారణంగా దోమలు పెరిగి మలేరియా, టైఫాయిడ్, డెంగీ తదితర సీజనల్ వ్యాధుల ప్రమాదం పొంచి ఉంది. దీని వల్ల చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు వ్యాధుల బారిన పడే అవకాశం ఏర్పడింది. అందుకే వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత పాటించాలని, సురక్షితమైన తాగునీరును తాగాలని వైద్యాధికారులు కోరుతున్నారు. దోమ తెరల వాడకంతో పాటు ఇంట్లో నిల్వ నీరు లేకుండా చూసుకోవడం ద్వారా కొంతమేర సీజనల్ వ్యాధులు దూరం చేయవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. క్లస్టర్ పరిధిలోని కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల పరిధిలోని 11 మండలాల్లో 22 మంది వైద్యాధికారులతో పాటు వందలాది మంది ఆరోగ్య, ఆశ సిబ్బంది అంటువ్యాధుల నివారణకు విశేష కృషి చేస్తున్నారు.

**సంపూర్ణ పారిశుధ్యంతోనే వ్యాధులు దూరం**

దోమల వ్యాప్తి కారణంగా మలేరియా, బోధకాలు, డెంగీ, చికున్‌గున్యా తదితర వ్యాధులను సంపూర్ణ పారిశుధ్య చర్యలు దూరం చేయవచ్చని వైద్యారోగ్యశాఖ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తుంది. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రతను పాటించాలని వారు సూచిస్తున్నారు. వర్షాకాల ప్రారంభ సమయంలో దోమలు గుడ్లు లార్వా దశకు చేరుకోవడం వల్ల సాధారణంగా దోమల ఉధృతి అధికంగా ఉంటుంది. నీరు నిల్వచేసిన డ్రమ్ములు, పాడైపోయిన టైర్లు, పూలకుండీలు, ఇంకుడు గుంతలు, సంపులు, పాడేసిన కొబ్బరి బొండాలు, ఫ్లవర్ వాజ్‌లు, రుబ్బురోళ్లు, వాటర్‌ట్యాంకుల్లో దోమల లార్వా అధికంగా వ్యాప్తి చెందుతుంది. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సీజన్లతో నిమిత్తం లేకుండా డ్రైడేపై అవగాహన కల్పిస్తూ తీసుకోవలసిన చర్యలను వివరిస్తున్నారు. దోమల నివారణలో భాగంగా దోమల లార్వా (డింభక దశ)ను తినే గంబూషియా చేపలను జిల్లాలోని ప్రతి గ్రామంలోని ప్రధాన చెరువుల్లో పెంచుతున్నారు. వైద్యారోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి జ్వర లక్షణాలు ఉన్న వారందరి రక్తాన్ని సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపిస్తున్నారు. ఫ్యామిలీ మెడికల్ ప్రోగ్రాం (ఎఫ్‌డీసీ)లో భాగంగా కూడా ఇంటింటికీ డాక్టర్లు రావడంతో అక్కడిక్కడే రోగులు పరీక్షలు చేయించుకుని మందులు వాడుతున్నారు. దీంతో పాటు జ్వరాలు నిర్ధారణ అయిన వారికి మెరుగైన చికిత్స అందించేందుకు గ్రామ సచివాలయాల్లో వైద్యా శిబిరాలను ఏర్పాటు చేసి వైద్య సేవలను అందిస్తున్నారు.చర్యలు తీసుకుంటున్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు సిబ్బంది ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నారు. పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్య పనులపై పంచాయతీ, ఆరోగ్య అధికారులు సమన్వయంతో చర్యలు చేపడుతున్నారు.



**డ్రైడేను కచ్చితంగా పాటించాలి**

వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీటిని తాగడం, వేడి ఆహారమే తీసుకోవడం, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, రోగ నిరోధక శక్తిని పెంచుకోవడం తదితర జాగ్రత్తలు తీసుకోవాలి.. గ్రామ. పంచాయతీలు నిర్దేశించిన సమయంలో వాటర్ ట్యాంకుల శుభ్రం చేయాలి. నీటి పరీక్షలు చేయించాలి. సీజనల్ వ్యాధుల నివారణకు అవసరమైన మందులు పీహెచ్‌సీలో సిద్ధంగా ఉన్నాయి.

– పి.భవానీశంకర్, వైద్యాధికారి, పెదపళ్ల పీహెచ్‌సీ

# 'కాశీ అన్నపూర్ణాదేవి' సేవలు అభినందనీయం

- ఘనంగా సేవా సమితి ప్రథమ వార్షికోత్సవం
- సేవా సమితి గౌరవ అధ్యక్షుడిగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి



వార్షికోత్సవంలో సేవాతత్పరులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, సేవా సమితి సభ్యులు



కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి గౌరవాధ్యక్షుడిగా ఎన్నికైన ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, అధ్యక్షుడిగా ఎన్నికైన సతీష్‌రెడ్డి

రావులపాలెం: ఏడాది కాలంలో కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు సంఘటితంగా ఏర్పడి చేసిన సేవలు అభినందనీయం అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి కొనియాడారు. ఆదివారం సేవా సమితి ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రావులపాలెం కాలువ అవతల రామాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జగ్గిరెడ్డి మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా సేవచేయాలనే తపనతో 150 మందితో శ్రీకాశీ అన్నపూర్ణాదేవి సేవాసమితి పేరిట సేవా సంస్థను ఏర్పాటు చేసి ఈ సంవత్సర కాలంలో వృద్ధులకు, వికలాంగులకు, వివిధ అనారోగ్యాలతో బాధపడుతున్న వారికి, అగ్నిప్రమాదాలలో ఇల్లు కోల్పోయిన వారికి రూ.8 లక్షల నగదును ఆర్థిక సహాయంగా అందజేసి వివిధ సేవా కార్యక్రమాలు చేయడం చాలా అభినందనీయమన్నారు. నిస్వార్థంగా చేసిన సేవ మనకు ఏదో ఒక రూపంలో తిరిగి తోడుగా నిలుస్తుంది అని, తాను 3 సార్లు శాసనసభ్యుడిగా గెలుపొందడం వెనుక వివిధ సేవా కార్యక్రమాలు కూడా ఒక కారణం అన్నారు. ఈరోజు ఇలాంటి మంచి కార్యక్రమంలో పాల్గొనడం ఒక అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా సేవా సమితి గౌరవ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే సంస్థ అధ్యక్షుడిగా గొలుగూరి వెంకట సత్యనారాయణ రెడ్డి (సతీష్‌రెడ్డి), సంస్థను తొలి నుంచి నడిపిస్తున్న మల్లిడి మాధవిని కార్యదర్శిగా ఎన్నుకున్నారు. వీరందరికీ జగ్గిరెడ్డి అభినందనలు తెలిపారు.

అనంతరం ర్యాలి గ్రామానికి చెందిన శ్యామ్ జాదూగర్, ఊబలంక మదర్‌థెరిసా ఆశ్రమం నిర్వహకుడు దిడ్ల కిషోర్ ఆశ దంపతులను, రావులపాలెం పీపుల్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు చెందిన కొవ్వూరి సుధాకర్ రెడ్డి, కర్రి సోమిరెడ్డి, రావులపాలెం కాలువ అవతల ఉన్న బ్రైట్ లైట్ అంధుల పాఠశాలకు చెందిన సింహాద్రి, వెదిరేశ్వరం గ్రామానికి చెందిన సోషల్ వర్కర్ సుబ్బాయమ్మ, కేఎస్ ఆర్ లైటింగ్ అధినేత కాశీ విశ్వేశ్వరరెడ్డి, ఎస్‌వీ ఈవెంట్స్ అధినేత కొవ్వూరి ధర్మారెడ్డి, వివిధ రకాలుగా ప్రజలకు సేవలందించిన పలువురికి ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి చేతుల మీదుగా దుశ్శాలువాతో సన్మానించి మెమెంటోలు అందజేశారు. సంస్థను ఇలానే ఇంకా ఎన్నో మంచి కార్యక్రమాలు చేయాలని కోరుతూ కాశీ అన్నపూర్ణా దేవి సేవా సమితి సభ్యత్వాన్ని ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, రావులపాలెం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు నాగిరెడ్డి కుటుంబ సభ్యులు సభ్యత్వం తీసుకున్నారు. అనంతరం లివర్ వ్యాధితో బాధపడుతున్న ఆలమూరు మండలం సూర్యారావుపేట గ్రామానికి చెందిన టేకిమూడి బాల వీర వెంకట సాయి తేజకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆపరేషన్ నిమిత్తం రూ.10 లక్షల ఎల్‌ఓసీని అందజేయగా, వారి కుటుంబసభ్యులకు సంస్థ తరపున రూ.15 వేల నగదును ఆర్థిక సహాయం ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో రావులపాలెం ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సాకా ప్రసన్నకుమార్, మన్యం వర్ధనరావు ఊబలంక ఉప సర్పంచ్ కొవ్వూరి దుర్గారెడ్డి, రావులపాలెం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కర్రి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు వింటూ.. సంక్షేమాన్ని వివరిస్తూ..

- రావులపాడులో గడప గడపకూ..
- పాల్గొన్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి



రావులపాడులో లబ్ధిదారులకు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: అభివృద్ధి, సంక్షేమం రెండుకళ్లుగా రాష్ట్రంలో పాలన సాగుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని రావులపాడులోని జయశ్రీ హాస్పిటల్ ఏరియా, భవాని హాస్పిటల్ ఏరియా, కాలువ గట్టు, మల్లయ్యదొడ్డి తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన నాటి నుంచి నేటి వరకు అందించిన సంక్షేమ పథకాలను వివరించి, ఏమైనా సమస్యలు ఉంటే చెప్పాలని వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ మట్టా సత్యదేవి, ఎంపీటీసీ దిడ్ల ఆశా, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కర్రి నాగిరెడ్డి, బాబ్జీ, కిషోర్, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, కార్యదర్శి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే చిట్టిబాబుకు పలువురి పరామర్శ



హైదరాబాద్‌లో ఎమ్మెల్యే చిట్టిబాబును పరామర్శిస్తున్న పార్టీ నాయకులు

అంబాజీపేట: హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబును సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, వైఎస్సార్ సీపీ నాయకులు వాసంశెట్టి పెదబాబు, రాయుడ కృష్ణ మహేష్, మట్టపర్తి జలంధర్‌లు ఆదివారం పరామర్శించారు. ఎమ్మెల్యే ఆరోగ్య క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. అలాగే కె.పెదపూడిలో వేంచేసియున్న రావులమ్మ అమ్మవారికి వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే త్వరగా కోలువాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చింతపల్లి వెంకటేశ్వరరావు, వాసర్ల మరిడి, అంబటి శ్రీను, ఉందుర్తి ఆనందబాబు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే ఆరోగ్యంగా ఉండాలంటూ పూజలు**

అంబాజీపేట: హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలంటూ కె.పెదపూడిలో వేంచేసిన రావులమ్మ అమ్మవారికి వైఎస్సార్ సీపీ నాయకులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే చిట్టిబాబు పేరును కుంకుమార్చనలు జరిపించారు. అస్వస్థతకు గురైన ఎమ్మెల్యే చిట్టిబాబు అమ్మవారి ఆశీస్సులు ఉండి ప్రజల మధ్యకు రావాలని పూజించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చింతపల్లి వెంకటేశ్వరరావు, వాసర్ల మరిడి, అంబటి శ్రీను, ఉందుర్తి ఆనందబాబు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

# 'నా భూమి-నా దేశం'ని విజయవంతం చేయాలి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు అయ్యాజీవేమా

పి.గన్నవరం: మండలంలో నా భూమి-నా దేశం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా పార్టీ శ్రేణులకు సూచించారు. పి.గన్నవరంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం మండల శాఖ అధ్యక్షుడు యర్రంశెట్టి సాయిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నా భూమి-నా దేశం మండల ఇన్‌చార్జి అయ్యాజీవేమా మాట్లాడారు. ఈ కార్యక్రమం కోసం మండల స్థాయిలో కమిటీ నియమించారు. బీజేపీని పటిష్టం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చిట్నీడి రంగసాయి, చీకరమెల్లి శ్రీనివాసరావు, తిక్కా సత్తిబాబు, అడ్డాల వెంకటేశ్వరరావు, పితాని వెంకటేశ్వరరావు, మోకా వరప్రసాద్, కుడుపూడి సూర్యనారాయణ, దిగుమర్తి ఏడుకొండలు, కొండా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**రెండు గ్రామాల్లో నా భూమి-నా దేశం**

మామిడికుదురు: బీజేపీ అధిష్టానం పిలుపు మేరకు రెండు గ్రామాల్లో ఆ పార్టీ నేతలు ఆదివారం నా భూమి-నా దేవం కార్యక్రమం నిర్వహించారు. మామిడికుదురులో మండల ప్రోగ్రామ్ కన్వీనర్, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ యాళ్ల దొరబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏంఏ వేమా ఆధ్వర్యంలో మట్టిని సేకరించారు. అప్పనపల్లిలో బీజేపీ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్ ఆధ్వర్యంలో మట్టిని సేకరించారు. ఆయా కార్యక్రమాల్లో మండల శాఖ అధ్యక్షుడు మెండా ఆదినారాయణ, పార్టీ నేతలు కంకిపాటి సుబ్బారావు, వేగి వెంకటేశ్వరరావు, పసుపులేటి మహలక్ష్మీరావు, కటికిరెడ్డి తమ్మయ్యనాయుడు, అడపా వెంకటరత్నం పాల్గొన్నారు.

# రేపు ఏఎంసీ చైర్మన్‌గా రవీదేవి ప్రమాణ స్వీకారం



రెడ్డి రవీదేవి

కొత్తపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్‌గా రెడ్డి రవీదేవి మంగళవారం పదవీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రవీదేవి కుటుంబం ముఖ్యంగా ఆమె భర్త, అవిడి సర్పంచ్ రెడ్డి చంటి వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచీ పార్టీకి, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి విజయానికి కృషి చేస్తూ విశ్వాసనీయతను చాటుకున్నారు. ఆ నేపథ్యంలో జగ్గిరెడ్డి సిఫారసు మేరకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కొత్తపేట ఏఎంసీ చైర్మన్‌గా రవీదేవిని నియమించారు. మరీ ముఖ్యంగా కొత్తపేట ఏఎంసీ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా బీసీ (శెట్టిబలిజ) సామాజిక వర్గానికి, అందునా మహిళకు ఈ పదవిని కట్టబెట్టడం ద్వారా ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఆ వర్గానికి గుర్తింపునిచ్చారు. ఆమె ప్రస్తుతం కోనసీమ తిరుపతిగా ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం వాడపల్లి వేంకటేశ్వరస్వామివారి దేవస్థానం పాలకమండలి సభ్యురాలిగా ఉన్నారు. రవీదేవి ప్రమాణ స్వీకార వివరాలను ఎంపీపీ మార్గన గంగాధరరావు, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు ఆదివారం విలేకరులకు వివరించారు. ఆ రోజు ఉదయం అవిడిలో రవీదేవి స్వగృహం తన స్వగృహం నుంచి భారీ ఊరేగింపుగా ఖండ్రిగ, పలివెల వంతెన, కొత్తపేట మెయిన్‌రోడ్డు, సత్యాసెంటర్, కౌశికరోడ్డు గుండా శ్రీకరి శుభకరి కల్యాణ మండపానికి చేరుకుంటారని తెలిపారు. 11 గంటలకు ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అధ్యక్షతన జరిగే సభలో పలువురు చట్టసభల ప్రతినిధులు పాల్గొనగా వారి సమక్షంలో రవీదేవి ప్రమాణస్వీకారం చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అత్యధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

**పాలకమండలి సభ్యులు వీరే..**

ఏఎంసీ పాలకమండలిలో గౌరవ చైర్మన్‌గా ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, చైర్మన్‌గా రెడ్డి రవీదేవి, వైస్ చైర్మన్‌గా ముదునూరి రామకృష్ణంరాజు (ఆత్రేయపురం), పాలకమండలి సభ్యులుగా కాళ్లకూరి అన్నపూర్ణ (వెలిచేరు), కడలి సుజాత (తాడిపూడి), షేక్ గౌసియాబేగం (రావులపాలెం), పింద్రాళ్ల సత్య (పలివెల), అవిశెట్టి రామలక్ష్మి (బిళ్లకుర్రు), మల్లేశ్వరపు వెంకటలక్ష్మి (దేవరపల్లి), కరుటూరి నాగమణి (అంకంపాలెం), పమ్మి సింహాచలం (పొడగట్లపల్లి), పితాని వెంకటేశ్వరరావు (రావులపాడు), సాకా జానకిరామరాజు (వానపల్లి), వానపల్లి త్రిమూర్తులు (గోపాలపురం), సత్తి సూరైడ్డి (రావులపాలెం), ఉర్రింకల శ్రీనివాసరావు (ఉచ్చిలి), ముసునూరి వెంకటేశ్వరరావు (కొత్తపేట) నియమితులయ్యారు. వారితో పాటు అఫీషియల్ సభ్యులుగా హెడ్ క్వార్టర్ సర్పంచ్, ఏడీఏ, మార్కెటింగ్ ఏడీ కమిటీలో ఉంటారు.

# నిరుపయోగంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



అంబాజీపేటలో నిరుపయోగంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

అంబాజీపేట: లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలనే లక్ష్యంతో అంబాజీపేట హడ్కో కాలనీలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలు ఏడాది నుంచి నిరుపయోగంగా ఉన్నాయి. హడ్కో కాలనీ, నెల్లివారిపేట వాసులు నిత్యం లోవోల్టేజీ సమస్యతో బాధపడుతున్నామని, సమస్యను పరిష్కరించేందుకు ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ వైర్లు వేయాలని విద్యుత్ శాఖ అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నామన్నారు. దాంతో ఏడాది క్రితం విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి లోవోల్టేజీ సమస్యను పరిష్కరిస్తామని అప్పటి విద్యుత్ శాఖ అధికారులు చెప్పారు. అనంతరం కాలనీకి వచ్చిన విద్యుత్ వైర్లను వేరే ప్రాంతానికి తరలించి వినియోగించుకున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అప్పటి నుంచి నేటి వరకు ట్రాన్స్‌ఫార్మర్‌ను నిరుపయోగంగా ఉంచడమే కాకుండా కాలనీలోని లోవోల్టేజీ సమస్యను పరిష్కరించలేదని స్థానికులు బహిరంగంగా విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలను వినియోగంలోకి తీసువచ్చి మా కాలనీలకు లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

### శ్మశానవాటిక సమస్యలపై నిరసన

మామిడికుదురు: స్థానిక శ్మశానవాటికలో నెలకొన్న సమస్యలపై జనసేన నేతలు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలోని చెత్త అంతా తీసుకు వచ్చి శ్మశానంలో వేస్తున్నారని, దీని వల్ల తీవ్ర ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరైనా చనిపోయినప్పుడు శవాన్ని తీసుకు వచ్చే వారు తీవ్ర దుర్వాసనతో అవస్థలు పడుతున్నారని వాపోయారు. ఇక్కడ నెలకొన్న సమస్యలపై తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ పార్టీ నేతలు రుద్రా శ్రీనివాస్, మట్టా సత్తిబాబు, యాలి రాంబాబు పాల్గొన్నారు.

### నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

రావులపాలెం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం ఉదయం 10:30 గంటలకు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో జి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఎంపీపీ కర్రి లక్ష్మీవెంకట నాగదేవి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి హాజరవుతారన్నారు. ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు. అలాగే అధికారులు శాఖల వారీగా ప్రగతి నివేదికతో రావాలన్నారు.

### నిత్యాన్న భవన నిర్మాణానికి విరాళాలు



దాతలకు స్వామి చిత్రపటం అందజేస్తున్న చైర్మన్ రమేష్‌రాజు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన భవన నిర్మాణానికి ఆత్రేయపురం మండలం నార్కెడ్ మిల్లి గ్రామానికి చెందిన చిన్న–సూర్యకళ దంపతులు రూ.30 వేలు, బిక్కవోలు మండలం కొంకుదురు గ్రామానికి చెందిన పి. సత్యస్వరూప్‌రెడ్డి–మమత నమ్రత దంపతులు రూ.10,116, గుడివాడకు చెందిన జి.గోసాయి నాగ యోగేశ్వర్‌రెడ్డి రూ.10,116, రామచంద్రపురానికి చెందిన కె.శరణ్ కుమార్–అనూష సాయి దంపతులు రూ.10,001 విరాళం అందించినట్లు చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. దాతలకు ఆలయ చైర్మన్ చేతుల మీదుగా స్వామి చిత్రపటం అందజేశారు.

### 12, 13 తేదీల్లో స్కూల్ గేమ్స్ నిర్వహణ



ఎంఈవో కిషోర్‌కుమార్

సఖినేటిపల్లి: మండలంలో కేశవదాసుపాలెం, మోరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 12, 13 తేదీల్లో 67వ స్కూల్ గేమ్స్ క్రీడోత్సవాలను నిర్వహిస్తున్నట్టు ఎంఈవో–1 డి.కిషోర్ కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఈమేరకు వివిధ పాఠశాలల హెచ్ఎంలు, వ్యాయామోపాధ్యాయులతో ఒక సమావేశం ఆయన నిర్వహించారు. ఆయా పాఠశాలలో నిర్వహించే గేమ్స్ వివరాలు, వేదికలను నిర్ణయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ నెల 12వ తేదీన కేశవదాసుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో అండర్–14, అండర్–17 బాలుర విభాగంలో పోటీలు ఏర్పాటు చేశామన్నారు. వీరికి వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, టెన్నికాయిట్, బాల్ బ్యాడ్మింటన్, బ్యాట్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్‌లో పోటీలు ఉంటాయన్నారు. అలాగే ఈ నెల 13వ తేదీన మోరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో అండర్–14, అండర్–17 బాలికల విభాగంలో పోటీలు ఏర్పాటు చేశామన్నారు. వీరికి వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, టెన్నికాయిట్, బాల్ బ్యాడ్మింటన్, బ్యాట్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, యోగాలలో పోటీలు ఉంటాయన్నారు. ఎంఈవో–2 మద్దాలి వెంకటేశ్వరరావు, వ్యాయామోపాధ్యాయులు శుభాకర్, కృష్ణప్రసాద్, సురేష్, గెజిటెడ్ హెచ్ఎంలు సుజాత, కృష్ణ పాల్గొన్నారు.

### సాత్విక్ సాయిరాజ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి



పోటీల విజేతలతో ఆర్డీవో వసంతరాయుడు, వాకర్స్, ఆఫీసర్స్ క్లబ్‌ల ప్రతినిధులు

అమలాపురం టౌన్: మండల షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు అమలాపురం నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆర్డీవో వసంతరాయుడు అన్నారు. అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్, ఆఫీసర్స్ రీక్రియేషన్ క్లబ్ సంయుక్త ఆధర్యంలో స్థానిక ఆఫీసర్స్ క్లబ్ ఇండోర్ కోర్టులో జరుగుతున్న మండల స్థాయి జూనియర్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీవో వసంతరాయుడు విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీలను విజయవంతంగా నిర్వహించిన కోనసీమ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్‌ను ఆర్డీవో అభినందించారు. అండర్–11, అండర్–13, అండర్–15 మూడు విభాగాల్లో క్రీడాకారులకు పోటీలు నిర్వహించినట్లు వాకర్స్ క్లబ్ కార్యదర్శి, విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ రంకిరెడ్డి కాశీ విశ్వనాథ్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ ఉపాధ్యక్షుడు డాక్టర్ మెట్ల వెంకట సూర్యనారాయణ, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, కార్యదర్శి పుత్సా కృష్ణ కామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.